క్లుప్తంగా

చురుగ్గా పన్నుల వసూళ్లు

• పరిశీలించిన కమిషనర్ నల్లనయ్య



పన్ను వసూలు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: స్థానిక నగరపాలక సంస్థలో పన్నుల వసూళ్ల ప్రక్రియ చురుగ్గా సాగుతున్నట్టు కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు కావడంతో సోమవారం అధికమంది పన్నులు చెల్లించారన్నారు. పన్నుల వసూలు ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. బకాయిదారుల వద్దకు వెళ్లి పన్నులు చెల్లించాల్సిందేనంటూ పట్టుబట్టి మరీ వసూలు చేశారు. సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.

పరామర్శ



జెడ్పీ చైర్మన్‌ను పరామర్శిస్తున్న పలువురు నాయకులు

విజయనగరం: ఇటీవల జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు రెండవ కుమారుడు మజ్జి ప్రణీత్‌బాబు మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఏపీ ఎన్జీవో విజయనగరం జిల్లా సంఘ సభ్యులు జెడ్పీ చైర్మన్‌ను సోమవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

విజయనగరం: ఎన్టీఆర్ భరోసా పథకం కింద మంగళవారం చేపట్టనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అదితిగజపతిరాజు పాల్గొంటారని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 13, 14 డివిజన్లలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారన్నారు. నగరంలోని 22,735 మందికి సచివాలయ, కార్పొరేషన్ సిబ్బంది పింఛన్లు అందజేస్తారన్నారు.

ఈకేవైసీకి గడువు పొడిగింపు

బాడంగి: రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ చేయించుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు సీఎస్‌డీటీ స్వర్ణలత ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ప్రస్తుత గడువు మార్చి నెలాఖరుతో ముగియగా, ఏప్రిల్ 30వ తేదీలోగా చేయించుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు పేర్కొన్నారు.

కమ్యూనల్ అవార్డులు అమలు చేయండి

బొబ్బిలి: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాధించి పెట్టిన కమ్యూనల్ అవార్డులను అమలు చేయాలని స్థానిక అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సమసమాజ భావన కలగాలన్నా, ఆర్థిక అసమానతలు తొలగాలన్నా, అందరూ సమానమేనన్న ఆలోచన ప్రతిఒక్కరూ చేయాలన్నా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, ఆయన కృషి ఫలితంగా పుట్టుకొచ్చిన కమ్యూనల్ అవార్డుల అమలు జరగాల్సిందేనన్నారు. దీనిపై ప్రభుత్వాలు స్పందించాలన్నారు. ఆయన వెంట ఎండ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

• ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులతో ఆరోగ్యం
• నెల్లిమర్ల నియోజకవర్గంలో ఏటా విస్తరిస్తున్న ప్రకృతి సేద్యం
• ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు, ఫలపత్రద్రావణాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



గోవిందపురంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటల సాగు

ప్రకృతి సేద్యం... ఆరోగ్య భాగ్యం



గోవిందపురంలో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పూసపాటిరేగ: పంటల సాగులో మితిమీరిన రసాయన ఎరువులను వినియోగించడం వల్ల ఆపంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు అధికంగా ఉండడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతు న్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఇతర పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తుండడంతో ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ లభిస్తోంది. ఈనేపథ్యంలో రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపిస్తున్నారు. ప్రకృతిసాగుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం తక్కువ పెట్టుబడితో కూడినది కావడం, అధిక దిగుబడులు వస్తుండడంతో రైతులు ప్రకృతి వ్యవసాయంపైనే ఆశక్తి చూపిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపు రం, నెల్లిమర్ల మండలాల్లో రైతులు 800 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వరి పంటతో పాటు జామి, బొప్పాయి, అరటి వంటి పండ్లతోటలను, వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలను బహుళ పంటల విధానంలో సాగుచేస్తు న్నారు. భూసారానికి సేంద్రియ ఎరువులు, పంటలను ఆశించే చీడపీడల నివారణకు సొంతంగా తయారు చేసుకుంటున్న జీవామృతాలు, కషాయాలను వినియోగిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తూ నిరంతర ఆదాయం పొందుతున్నారు. స్వచ్ఛమైన పంట ఉత్పత్తులు కావడంతో వీటికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. అలాగే ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి.

విస్తృతంగా అవగాహన

ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటున్నారు. పంటలకు కావాల్సిన పోషకాలు, తెగుళ్లు, చీడపీడల నివారణకు రసాయన ఎరువుల స్థానంలో వినియోగించాల్సిన ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు, ఫలపత్రద్రావణాల తయారీపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రైతులతో సామూహికంగా కషాయాలు, జీవామృతాలు, ఫలపత్ర ద్రావణాలు తయారు చేయించడంతో పాటు వాటిని వినియోగించే విధానాన్ని వివరిస్తున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సలహాలు సూచనలతో రైతులు మంచి దిగుబడులు సాదిస్తున్నారు.

అన్ని విధాలా మేలు

ప్రకృతి వ్యవసాయం అన్ని విధాలా మేలు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసారం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. జీవన ఎరువులు, కషాయాల తయారీపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపిస్తుండడంతో ఏటా ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

– కె.నీలిమ, ఏఓ, పూసపాటిరేగ మండలం

రైతులు ఆసక్తి చూపిస్తున్నారు

పంటలు సాగు విధానంలో రైతులు మార్పు కోరుకుంటున్నారు. పంటలకు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రకృతి విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి, సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– విక్రం కమల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మన్యం పసుపు రెడీ



పసుపు కొమ్ములను మార్కెట్‌కు తరలిస్తున్న గిరిజన మహిళలు



లాడలో ఆరెబెట్టిన పసుపు కొమ్ములు



ఈతమానుగూడలో పసుపు కొమ్ములు ఉడకబెడుతున్న గిరిజనులు

ఏజెన్సీలో పసుపు సీజన్ ఆరంభమైంది. పసుపు పంట చేతికి రావడంతో గిరిజన రైతులు తవ్వుతున్నారు. అనంతరం పచ్చి పసుపును ఉడకబెట్టి, ఎండవేసి విక్రయానికి సిద్ధంచేస్తున్నారు. ప్రస్తుతం సీతంపేట ఏజెన్సీలోని ఏ గ్రామానికి వెళ్లినా పసుపు సిద్ధంచేస్తున్న దృశ్యాలే సాక్షాత్కరిస్తున్నాయి. పచ్చిపసుపు కావిడ ధర రూ.1000 పలుకుతుంటే ఎండు పసుపు రూ.1500ల నుంచి రూ.1800ల మధ్య విక్రయిస్తున్నట్టు గిరిజన రైతులు తెలిపారు. – సీతంపేట

ఎన్నికల హామీలు నీటి మూటలేనా?

• ఉచిత బస్సు ప్రయాణం తుస్సుమనిపించారు
• ఉత్తుత్తి ప్రజాదర్బారులతో కాలం వెళ్లదీత
• సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న యంత్రాంగం
• మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



విలేకరుల సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ఫొటోను చూపిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: ఎన్నికల హామీలు నీటిమూటలేనా?.. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని ఎన్నికల ప్రచారంలో గొప్పగా చెప్పిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇప్పుడు మహిళలకు ఏం సమాధానం చెబుతారని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. సాలూరులోని తన నివాసంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఉత్తుత్తి హామీలిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌తో పబ్బంగడుపుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాదర్బార్లు, గ్రామసభలు, గ్రీవెన్సులు పెట్టి ప్రజలకు ఏదో చేస్తున్నామని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఇంతవరకు ప్రజాసమస్యల పరిష్కర వేదికకు ఎన్ని వినతులు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారన్న విషయం తెలుసుకునేందుకు ఆర్టీఐ ప్రతినిధి పిరిడి రామకృష్ణ సమాచార హక్కుచట్టానికి దరఖాస్తు చేసి నెలరోజులవుతున్నా ఇంతవరకు జిల్లా అధికారుల నుంచి స్పందనలేదన్నారు. పాచిపెంట మండలం కేసలి పంచాయతీ సమాచారానికి టీడీపీ నాయకుడు సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు కావాలని దరఖాస్తుచేసుకుంటే వెంటనే ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై సమాచారం కోసం స్వయంగా తాను దరఖాస్తు చేసినా సమాచారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. న్యాయవాది రేగుమహేశ్వరరావు పెట్టిన దరఖాస్తుకు కూడా అధికారులు స్పందించలేదన్నారు. చట్టం తమకంటే ఎక్కువ కాదనుంకుంటే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. తన స్నేహితుడు ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైర్ అయి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి బెనిఫిట్స్ అందలేదని దరఖాస్తు చేసుకుంటే, సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కరించామని మెసేజ్ పంపించారన్నారు. మేధావుల పరిస్థితే ఇలా ఉంటే సామన్యుడి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థంచేసుకోవచ్చన్నారు.

అభివృద్ధి పనులు నిరంతర ప్రక్రియ

అభివృద్ధి పనులు కొనసాగించడం ప్రభుత్వాల నిరంతర ప్రక్రియ అని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. సిమిడివలస బీటీ రోడ్డు ప్రారంభ అంశంపై స్పందిస్తూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో కొబ్బరికాయ కొట్టి విడిచిపెట్టిన కందుల పదం వంతెన, మోసూరు వంతెన, సాలూరు వేగావతి నదిపై పాంచాలి వెళ్లే వంతెన, సాలూరు 100 పడకల ఆస్పత్రి నిర్మాణాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిచేసిందన్నారు. సిమిడివలస రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని, ఇప్పుడు రోడ్డు పూర్తికావడంతో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావడం మంచివిషయమన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, మండల నాయకుడు దండి శ్రీను, మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ , కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

జోరుగా పన్నుల వసూళ్లు

బొబ్బిలి: పట్టణంలో పన్నుల వసూళ్లు జోరుగా జరుగుతోంది. ప్రజలు బకాయిపడిన ఆస్తిపన్ను సహా ఇతర పన్నులను మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారు. బకాయిలు పెండింగ్ ఉన్న వారి వద్దకు వెళ్లి, బకాయి పన్నుల వడ్డీ చెల్లింపులో కల్పిస్తున్న 50 రాయితీ సదుపాయాన్ని తెలిపి, పన్నులు చెల్లించేందుకు చొరవ చూపేలా చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఈ పన్నుల వసూళ్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వస్త్రదానం

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో ఉన్న 70 మంది వృద్ధులకు రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్వీ రమణ సోమవారం వస్త్రదానం చేశారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తువ్వాళ్లు, చీరలు, ధోవతీలు, దుప్పట్లు పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు.

శ్రీరామనవమి పూజలు ప్రారంభం

బాదంగి: శ్రీరామనవమి పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక కోదండరామ ఆలయంలో సోమవారం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేయడంతో పాటు రుద్రహోమం, సహస్రనామార్చన, వేదస్వస్తి పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో ఈ నెల 7వ తేదీ సాయంత్రం సీతారాముల కల్యాణ మహోత్సవం, 8వ తేదీ రాముని పట్టాభిషేకం నిర్వహిస్తామన్నారు. అదేరోజు మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం చేపడతామన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య పేర్కొన్నారు. స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో సోమవారం టెర్రస్ ఉద్యాన్ వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో మేడలపైన మొక్కలు పెంపకంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంటి మేడలు, బాల్కానీలో ఆకుకూరలు, కూరగాయలు పెంచేలా సంస్థ ప్రతినిధులు చేపడుతున్న అవగాహన ఎంతో అభినందనీయమన్నారు. మహిళలందరూ ఇంటిచెత్తను కంపోస్టుగా తయారుచేసుకుని వాటితోనే మొక్కలు పెంపకానికి ఉపయోగపడేలా చూడాలన్నారు. ఎండాకాలంలో ఆ మొక్కలను ఎలా రక్షించుకోవాలి, ఎటువంటి పంటలను వేసుకోవాలి అన్నవాటిపై ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా బాల్కానీలో కూరగాయలు, ఆకుకూరలు పెంచేందుకు నారు, విత్తనాలు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు లలితా శ్రీనివాస్, కళ్యాణి, దివ్యబాలకృష్ణ, విశాఖ వనమాలి గ్రూప్‌నకు చెందిన సరిత, అరుణ జ్యోతిప్రియాంక, గ్రీన్ క్లెమైట్ ఎన్‌జీఓ రత్నం, హౌసింగ్ పీడీ మురళి, హార్టీకల్చర్ ఉద్యోగి ఉమాభరణి పాల్గొన్నారు.

• అడుగంటి‘నది’..!



చంపావతి నదిలో నీటి ప్రవాహం పూర్తిగా అడుగంటింది. ఎండలు మండుతుండడం, ఊటలు తగ్గిపోవడంతో మార్చినెల చివరిలోనే నీటి జాడలు కరువయ్యాయి. పశువులు, రజకులతో పాటు తాగునీటి కష్టాలు తప్పవని నదీతీర గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ఎండాకాలం..బండి భద్రం

• ద్విచక్రవాహదారులు జాగ్రత్తలు పాటించాల్సిందే..



ఎండలో పార్కింగ్ చేసిన వాహనాలు

విజయనగరం: వేసవి వేడికి రోడ్లే కాదు. వాహనాలు భగ్గుమంటున్నాయి. నడిరోడ్డు మీదే బుగ్గిపాలు అవుతున్నాయి. ఎండాకాలం వస్తుందంటే చాలు వాహనాలు, ప్రత్యేకించి కార్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించడంతో పాటు ఇంజిన్ను చల్లబరిచే అన్ని రకాల ఉపశమనాలు పూర్తిస్థాయిలో ఉన్నాయో లేదో, టైర్లలో గాలి తగినంత ఉందో లేదో సరి చూసుకోవాలి.

జిల్లాలో అన్ని వాహనాల కంటే ద్విచక్రవాహనాల సంఖ్య అధికం. కార్లకు, ఆటోలకు పైన రక్షణ ఉంటుంది. ద్విచక్రవాహనాల పరిస్థితి ఇందుకు భిన్నం. రోజువారీ జీవితంలో అంతర్భాగమైన వాహన విషయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉండవు. ఎండ వేడిమి కారణంగా పెట్రోల్ ఆవిరైపోవడం, పెట్రోలు లీకేజీతో మంటలు చెలరేగడం, టైర్లలో గాలి తగ్గడం వంటివి తరచూ గమనిస్తుంటాం. వీటి నిర్వహణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే వేసవి నుంచి గట్టెక్కవచ్చని మెకానిక్ లు సూచిస్తున్నారు.

ఇలా చేస్తే మేలు..

- వేసవిలో వాహనాలను సాధ్యమైనంత వరకు ఎండలో నిలపకుండా ఉంటే మంచిది.
- వేసవి ప్రారంభానికి ముందే సర్వీసింగ్ చేయించడం మంచిది.
- సర్వీసింగ్ సమయంలో అన్ని రకాల లిక్విడ్ల స్థాయిలను చెక్ చేశారో లేదో తెలుసుకోవాలి.
- టైర్లలో గాలి తగినంత ఉండేలా చూసుకోవాలి. ఇంధనం నింపుకొనే సమయంలో టైర్లలో గాలి చెక్ చేయించడం అలవాటు చేసుకోవాలి.
- లైట్లు, హారన్, స్టీరియోల వంటివి మార్చకుండా ఉంటే మంచిది.
- ద్విచక్రవాహనంపై ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తే 40 కిలోమీటర్లకు ఒకసారి ఆగి వెళ్లడం మంచిది.
- ప్రయాణం చేసే సమయంలో కాకుండా వేచి ఉండాల్సిన సందర్భంలో ఏసీ వేయడం వల్ల ఇంజిన్ బాగా వేడెక్కుతుంది. కాబట్టి ఏసీ వేయొద్దు.
- నిలిపి ఉంచిన కారు అద్దాలను అర అంగుళం మేర కిందకు దించడం మేలు. ఒక్కోసారి లోపల వేడికి అద్దాలు పగిలిపోతుంటాయి.

బిల్లులు చెల్లించకపోవడం దారుణం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఉపాధి హామీ పథకం వేతనదారులకు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు బొబ్బిలి నియోజకవర్గంలో జరిగే ఉపాధి పనులకు బిల్లుల చెల్లింపులు సక్రమంగానే జరిగేవన్నారు. కేంద్రం చెల్లించే ఈ బిల్లుల్లో ఎప్పుడూ ఇప్పుడు ఉన్నంత జాప్యం లేదన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మొదటి రెండు వారాలే బిల్లులు చెల్లించి, ఆ తర్వాత నుంచి నిలిపివేశారని ఆరోపించారు. పనులు చేయించుకుని, నెలల తరబడి బిల్లులు చెల్లించని సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఈ బిల్లులు చెల్లించకపోవడం చూస్తే ఉపాధి నిధులు వేరే పనులకు ఏమైనా చెల్లించారా అనే అనుమానం అందరిలో కలుగుతోందన్నారు. ఇప్పటికైనా ఉపాధి వేతనదారులకు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇ.గోపాలరావు, తూముల భాస్కరరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీ కృష్ణారావు, రమాదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్లపై చర్యలకు వెనకాడేది లేదు..

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ టిక్కెట్‌పై కౌన్సిలర్లుగా గెలుపొందిన వారు డబ్బు, ఇతర ప్రలోభాలకు ఆశపడి వేరే పార్టీకి మద్దతు పలుకుతున్నట్లు తెలుస్తోందని, అటువంటి వారిపై చర్యలకు వెనకాడేది లేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు స్పష్టం చేశారు. స్థానిక పట్టణంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో సోమవారం సమావేశమైన ఆయన.. సమావేశానికి కొంతమంది కౌన్సిలర్లు హాజరుకావడంపై ఆరాతీశారు. ఇన్నాళ్లూ అదిగో ఇదిగో అంటూ మాట్లాడిన ప్రతిపక్ష కౌన్సిలర్లు ఇప్పుడు మా వైపు ఇంతమంది ఉన్నారు.. అంతమంది ఉన్నారు.. అవిశ్వాస తీర్మానం పెడతామని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.